మళ్లీ మోదీనే ప్రధాని కావడం ఖాయం

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

అడ్డగుట్ట: భారతదేశ ప్రధానిగా మళ్లీ నరేంద్ర మోదీనే కానున్నారని కేవలం అధిక సీట్లు సాధించడం కోసం బీజేపీ కృషి చేస్తోందని కేంద్ర మంత్రి, సికింద్రాబాద్ లోక్‌సభ అభ్యర్థి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం అడ్డగుట్ట డివిజన్ శాంతి నగర్, తుకారాంగేట్ ప్రాంతాల్లో పలు కుల సంఘాల, ప్రజా సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా ప్రధాని మోదీకి ప్రజలందరూ బ్రహ్మరథం పడుతున్నారని, ఆయన పాలననే కోరుకుంటున్నారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల పేరుతో గారడీలు చేస్తుందని, నీటి, కరెంట్ కోతలే అందుకు నిదర్శనం అన్నారు. బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేస్తే వృథాగా పోతుందని, రాష్ట్రంలో అధికారం చేజార్చుకున్న బీఆర్ఎస్ పార్టీని ప్రజలెవరూ నమ్మడం లేదన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ నుంచి లోక్‌సభ అభ్యర్థులుగా పోటీ చేసేందుకు ఏ ఒక్కరూ ముందుకు రావడం లేదన్నారు. ప్రజల ఆశీస్సులతో ముందుకొస్తున్న ఏకైక నాయకుడు మోదీ అన్నారు. ప్రధాని మోదీ సారథ్యంలో సికింద్రాబాద్ అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి ఎంతో నీతి నిజాయితీతో పని చేస్తున్నానన్నారు. బిజేపీ నాయకులు శ్యాంసుందర్‌గౌడ్, సారంగపాణి, బండ కార్తీకరెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, కన్నాభిరాం, మహేష్, నరేందర్, వీరేష్, మహేందర్, నందు, ఉదయ్ యాదవ్, శివాజీ పాల్గొన్నారు.

మోదీని మరోసారి ఆశీర్వదించండి..

లాలాపేట: దేశాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్న ప్రధాని మోదీని మరోసారి ఆశీర్వదించాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తార్నాకలో బీజేపీ జిల్లా కార్యదర్శి వీరన్న ఆధ్వర్యంలో పలు అపార్టుమెంట్ వాసులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కిషన్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. మోదీ హయాంలో బేగంపేట ఎయిర్‌పోర్టు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, సికింద్రాబాద్, నాంపల్లి రైల్వే స్టేషన్ల అభివృద్ధి పనులతో పాటు 4 వందేభారత్ రైళ్లను మన రాష్ట్రానికి తీసుకువచ్చారని గుర్తు చేశారు. రానున్న రోజుల్లో మరింత అభివృద్ధిని చేసుకోవడానికి బీజేపీని గెలిపించాలన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ రామ్‌చందర్‌రావు, మాజీ మేయర్ బండా కార్తీకరెడ్డి, స్థానిక అపార్టుమెంట్ వాసులు పాల్గొన్నారు.

బీజేపీ నుంచి టికెట్ ఇస్తే భారీ మెజార్టీతో గెలుస్తా



మాట్లాడుతున్న వంశ తిలక్ మాదిగ

రసూల్‌పురా: కంటోన్మెంట్ నియోజకవర్గ ఉప ఎన్నిక విషయమై బీజేపీ నుంచి తాను టికెట్ ఆశిస్తున్నట్లు టీఎస్. వంశ తిలక్ మాదిగ తెలిపారు. శుక్రవారం కంటోన్మెంట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తనది రాజకీయ కుటుంబ నేపథ్యమని తన తల్లి టీఎస్.సదాలక్ష్మి కంటోన్మెంట్ బొల్లారం ప్రాంతానికి చెందిన వారని అన్నారు. సదాలక్ష్మి 1957లో కాంగ్రెస్ తరపున ఎస్సీ రిజర్వుడు స్థానం కామారెడ్డి నుంచి శాసన సభకు ఎన్నికయ్యారని చెప్పారు. 1960లో డిప్యూటి స్పీకర్‌గా 1962లో ఉమ్మడి రాష్ట్రంలో తొలి మహిళా మంత్రిగా పని చేసారని గుర్తు చేశారు. తన తండ్రి టీవీ.నారాయణ ఎపీపీఎస్సీ సభ్యుడు, ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యుడిగా కొనసాగారని చెప్పారు. తాను బీజేపీలో కొనసాగుతున్నానని కంటోన్మెంట్ ప్రజలతో తనకు మంచి అనుబంధం ఉందని టికెట్ ఇస్తే భారీ మెజార్టీతో గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు.

ప్రొ.మధుజ్యోతికి తెలుగు వర్సిటీ పురస్కారం



ప్రొ.మధు జ్యోతిని సత్కరిస్తున్న అతిథులు


ఉస్మానియా యూనివర్సిటీ: ద్రావిడ విశ్వవిద్యాలయం వీసీ ప్రొ.కొలకలూరి మధుజ్యోతి పొట్టి శ్రీరాములు తెలుగు వర్సిటీ ఉత్తమ రచయిత్రి ప్రతిభా పురస్కారం అందుకున్నారు. తెలుగు భాష సాహిత్య రచనలు చేసిన సేవలను గుర్తించిన తెలుగు వర్సిటీ 2022 ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవంలో వీసీ ప్రొ.మధుజ్యోతికి ఉత్తమ రచయిత్రి పురస్కారంతో పాటు రూ. 20,166 నగదును ముఖ్య అతిథిగా హాజరైన సినీ దర్శకులు బి.నర్సింగరావు, వీసీ ప్రొ.తంగెడ కిషన్‌రావు అందజేశారు. తెలుగు ప్రొఫెసర్‌గా జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొని 300లకు పైగా పరిశోధన పత్రాలు సమర్పించారు. వివిధ పత్రికల్లో 101 వ్యాసాలు రాసిన ఆమె వద్ద 13 మంది విద్యార్థులు పీహెచ్‌డీ 5 మంది ఎంఫిల్ పట్టాలు అందుకున్నట్లు వివరించారు.

జింఖానా మైదానంలో ఎగ్జిబిషన్ ప్రారంభం



ఎగ్జిబిషన్ ప్రారంభిస్తున్న సీఈవో మధుకర్ నాయక్

రసూల్‌పురా: దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన హస్త కళాకారులు, చేతి వృత్తులు రూపొందించిన కళాఖండాలు జంటనగరాల ప్రజలకు అందుబాటులో ఉన్నాయని కంటోన్మెంట్ బోర్డు సీఈవో మధుకర్ నాయక్ తెలిపారు. శుక్రవారం జింఖానా మైదానంలో గాంధీ స్మృతి, దర్శన్ సమితి ఆధ్వర్యంలో పునర్ మహోత్సవ్ ఎగ్జిబిషన్ ప్రదర్శనను సీఈవో మధుకర్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ.. ప్రధానమంత్రి చైర్మన్‌గా ఉన్న గాంధీ స్మృతి సంస్థ ద్వారా కళాకారులకు ప్రోత్సాహం అందించేందుకు దేశ వ్యాప్తంగా ప్రధాన పట్టణాల్లో ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేస్తున్నారని అందులో భాగంగా మన హైదరాబాద్ నగరంలో పదిహేను రోజుల పాటు ప్రదర్శన ఉంటుందని చెప్పారు. ప్రదర్శనలో వివిధ కళాకృతులు, జనపనార, తోలు వస్తువులు, లక్క గాజులు, వస్త్రాలు నగర వాసులకు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. సంగీత సాంస్కృతి కార్యక్రమాలు రుచికరమైన వివిధ రాష్ట్రాలకు చెందిన వంటకాలు అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు వెల్లడించారు.





క్రైస్తవులకు సందేశం ఇస్తున్న స్టీఫెన్‌పాల్



భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రై డే



సనత్‌నగర్ క్రిస్టియన్ యూత్ ఆధ్వర్యంలో క్రాస్ ర్యాలీ



లాలాపేట శిలువ సువార్త యాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

గుడ్‌ఫ్రైడే సందర్భంగా వివిధ చర్చిల్లో క్రైస్తవులు యేసు క్రీస్తు మరణాన్ని స్మరించుకుంటూ ప్రార్థనలు చేశారు. ఎస్డీరోడ్‌లోని సెయింట్ మేరీస్ చర్చిలో కార్డినల్, బిషప్ రైట్ రెవరెండ్ పూల ఆంథోని ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సెంటినరీ బ్యాప్టిస్ట్ చర్చి, సీఎస్ఐ వెస్లీ చర్చి, గుడ్‌న్యూస్ బ్యాప్టిస్ట్ చర్చి, మిల్లీనియం మెథడిస్ట్ చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సనత్‌నగర్ క్రిస్టియన్ యూత్ ఆధ్వర్యంలో శుక్రవారం క్రాస్ ర్యాలీ నిర్వహించారు. శాంతినగర్‌లోని బెత్లహేమ్ ఎవాంజలికల్ బాప్టిస్టు చర్చి ఆధ్వర్యంలో లాలాపేటలో సిలువ సువార్త యాత్రను చేపట్టారు.

–రాంగోపాల్‌పేట్ /సనత్‌నగర్/లాలాపేట



తరుముకొస్తున్న నీటి ఎద్దడి!

- మండుటెండలకు పెరిగిన నీటి అవసరాలు
- ట్యాంకర్ల రాకలో జాప్యం
- 'ప్రైవేటు'ను ఆశ్రయిస్తున్న ప్రజలు

సనత్‌నగర్: ఎండలు ముదురుతున్న కొద్దీ నీటి ఎద్దడి తరుముకొస్తోంది. అంతకంతకూ పెరుగుతున్న అపార్ట్‌మెంట్ కల్చర్.. ఆపై ఇబ్బడి ముబ్బడిగా బోర్లు వేసి వేల అడుగుల కింది నుంచి భూగర్భ జలసిరిని తీసుకువస్తున్నా అవసరాలకు ఏమాత్రం సరిపోవడం లేదు. పైగా ప్రస్తుతం పాతాళానికి వేస్తున్న బోర్లతో ఒకప్పటి బోర్లు ఎండిపోయి నోరెళ్లబెట్టి చూస్తున్నాయి. ఒక్క జెక్‌కాలనీని పరిశీలిస్తే ఒకప్పుడు 900 నుంచి 1000 అడుగుల వరకు బోర్లు వేస్తే జలధార పుష్కలంగా ఉండేది. కానీ ఇప్పుడు ఏకంగా 2500 అడుగుల మేరకు వెళ్తే గానీ గంగమ్మ ఆచూకీ కనిపించడం లేదు. దీంతో అప్పట్లో 900 ఫీట్ల వరకే వేసిన బోర్లు కాస్తా ఇప్పుడు నీటి చుక్క లేక ఆవురావురమంటున్నాయి. ఇలా జెక్‌కాలనీలో సగం వరకు బోర్ల పరిస్థితి ఇదే. ఇక గత్యంతరం లేక జలమండలి సరఫరా చేసే నీటి ట్యాంకర్లపై ఆధార పడాల్సిన పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయి.

ప్రైవేటు ట్యాంకర్లకు డిమాండ్.

గతంలో ట్యాంకర్ బుక్ చేసిన 24 గంటల లోపు వచ్చేవి. రానురాను ప్రస్తుతం మరుసటి రోజు కూడా వచ్చే పరిస్థితి లేదు. మార్చి నెలలోనే పరిస్థితి ఈ విధంగా ఉంటే ఇక ఏప్రిల్, మే నెలల్లో పరిస్థితులు ఏవిధంగా ఉంటాయోనని ఆందోళన కలిగిస్తోంది. ఇది ఒక్క జెక్ కాలనీకే పరిమితం అనుకుంటే పొరపాటు. అంతటా ఇదే పరిస్థితి నెలకొంది. సనత్‌నగర్, అమీర్‌పేట డివిజన్లకు ఫతేనగర్, ఎస్సార్‌నగర్ సెక్షన్ల నుంచి నీటి సరఫరా జరుగుతుంది. ఆయా సెక్షన్ల పరిధిలో ఇంటింటికీ నల్లా కనెక్షన్‌తో పాటుగా అవసరమైన వారికి దాదాపు 20 ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా జరుగుతుంది. అయితే ఈ రెండు సెక్షన్ల పరిధిలో దాదాపు అన్నీ అపార్ట్‌మెంట్లే. అందులోనూ అమీర్‌పేట, ఎస్ఆర్‌నగర్ ప్రాంతాల్లో హాస్టళ్లు, వ్యాపార, వాణిజ్య సముదాయాలే ఎక్కువగా ఉంటాయి. ఈ క్రమంలో పైప్‌లైన్ ద్వారా జలమండలి సరఫరా చేసే నీరు సరిపోవడం లేదు. దీంతో ట్యాంకర్లపై ఆధారపడక తప్పని పరిస్థితి. గత వేసవితో పోలిస్తే ఇప్పుడే ట్యాంకర్లకు డిమాండ్ పెరగడంతో ట్యాంకర్ల డెలివరీ సమయం కూడా అంతకంతకూ పెరుగుతోంది.

నివాసితులపై అ'ధన'పు భారం..

జెక్‌కాలనీ ఒక్క లక్ష్మీనివాస్‌ను ఉదాహరణగా తీసుకుంటే..ఇందులో 40 కుటుంబాలు ఉంటాయి. రెండు బోర్లు ఉంటే అవి ఎండిపోయి నీరు రావడం లేదు. దీంతో పూర్తిగా జలమండలి ట్యాంకర్ల నీటి పైనే ఆధారపడాల్సి వస్తోంది. రోజుకు 20 వేల లీటర్లు ట్యాంకర్ల ద్వారా పోయించుకుంటున్నారు. అంటే 10 వేల లీటర్ల సామర్థ్యం ఉన్న ట్యాంకర్ వెయ్యి రూపాయలు కాగా రోజుకు రూ.2000ల నీటి కోసం వెచ్చించాల్సి వస్తోంది. అలాగే నెలకొచ్చేసరికి రూ.60 వేలు నీటి కోసం ఖర్చు చేయాల్సిందే. ఇక జలమండలి ట్యాంకర్ కాస్త ఆలస్యమైతే కమర్షియల్ ట్యాంకర్ గానీ, ప్రైవేటు వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటిని పోయిస్తే మాత్రం రెట్టింపు చెల్లించుకోవాల్సిందే. ఈ రకంగా ఒక్కొక్క కుటుంబంపై నెలకు దాదాపుగా రూ. 2000 వరకు భారం పడుతుంది.

అధికారులు చొరవ తీసుకోవాలి..

తమ అపార్ట్‌మెంట్‌లో రెండు బోర్లు కూడా పని చేయడం లేదు. దీంతో మంచినీటి ట్యాంకర్లను బుక్ చేసుకుంటున్నాం. వేసవి రావడంతో నీటి అవసరాలు కూడా పెరిగాయి. దీంతో 10 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన రెండు ట్యాంకర్ల అవసరం తప్పనిసరి. దీంతో బుక్ చేసుకుంటే మరుసటి రోజుకు గానీ రావడం లేదు. ఒక్కోసారి రెండు రోజులకు కూడా రావు. ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే రానున్న రోజులను తలుచుకుంటే భయమేస్తోంది. సంబంధిత అధికారులు సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి.

–చక్రధర్‌యాదవ్, జెక్‌కాలనీ

ప్రైవేటు ట్యాంకర్లే దిక్కు..

మా అపార్ట్‌మెంట్‌కు నాలుగు బోర్లు ఉండేవి. అందులో మూడు ఎండిపోయాయి. ఒక్కటే పని పని చేస్తుంది. దీంతో జలమండలి ట్యాంకర్లు, ప్రైవేటు ట్యాంకర్లపై ఆధార పడాల్సి వస్తోంది. ఈ రోజు బుక్ చేస్తే రేపటికి కూడా రావడం లేదు. అవసరమైనవన్ని నీళ్ల లేక ఇక్కట్లకు గురవుతున్నాం. ప్రైవేటు ట్యాంకర్లను ఆశ్రయించినా సరైన సమయానికి రావడం లేదు.

–మల్లారెడ్డి, వాసవీ డ్రీమ్స్, జెక్‌కాలనీ

ఏప్రిల్ 7 వరకు చేనేత హస్తకళా ప్రదర్శన

లాలాపేట: తార్నాకలోని ఐఐసిటి స్టాఫ్ క్లబ్‌లో కొనసాగుతున్న కళా సిల్క్ చేనేత హస్తకళా ప్రదర్శన ఈ నెల 31తో ముగియనుండగా మరో వారం రోజుల పాటు ఏప్రిల్ 7 వరకు పొడిగించినట్లు నిర్వాహకులు వికాస్ జైన్ ఓ ప్రకటనలో తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలతో పాటు దేశంలోని పలు రాష్ట్రాల నుంచి దాదాపు 50 మంది చేనేత హస్తకళాకారులు సొంతంగా తయారు చేసిన వస్త్రాలు విక్రయానికి సిద్ధంగా ఉన్నాయన్నారు.

డాక్టరేట్ ప్రదానం



డాక్టరేట్ అందుకుంటున్న శ్రీనివాస్‌రావు

సికింద్రాబాద్: సీతాఫల్‌మండికి చెందిన సామాజిక కార్యకర్త బాసాని శ్రీనివాస్‌రావుకు ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. స్ఫూర్తి సర్వీస్ సొసైటీ ఆఫ్ ఇండియా సంస్థ నగరంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో బాసాని శ్రీనివాస్‌రావుకు గౌరవ డాక్టరేట్‌ను అందించారు. సామాజిక, ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు తనకు డాక్టరేట్‌ను ప్రదానం చేసిన ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ, స్ఫూర్తి సర్వీస్ సొసైటీ ఆఫ్ ఇండియా సంస్థ నిర్వాహకులకు బాసాని శ్రీనివాస్‌రావు కృతజ్ఞతలు తెలిపారు.

ఇఫ్తార్‌లో విందులో నివేదిత



ముస్లిం సోదరులకు భోజనం వడ్డిస్తున్న నివేదిత

రసూల్‌పురా: రంజాన్ మాసం మతసామరస్యానికి ప్రతీక అని బీఆర్ఎస్ నాయకురాలు నివేదిత అన్నారు. పవిత్ర రంజాన్ మాసం పురస్కరించుకుని ముస్లిం సోదరులు గన్‌బజార్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో నివేదిత హాజరై ఉపవాస దీక్షను విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్. శ్రీనివాస్, అజ్జు, వాహెబ్, అంజద్, నజీర్ అహ్మద్ కుమార్, దేవులపల్లి శ్రీనివాస్, మురళియాదవ్, భాస్కర్, వంగల మల్లేష్ పాల్గొన్నారు.

బీసీలకు కాంగ్రెస్ పార్టీ సగం స్థానాలు కేటాయించాలి



మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

రాంగోపాల్‌పేట్: ప్రస్తుత పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బీసీలకు జనాభా దామాషా ప్రకారం సగం పార్లమెంటు స్థానాలు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం సికింద్రాబాద్‌లోని విశ్వకర్మ సంఘం భవనంలో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష చారితో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఉదయ్‌పూర్ డిక్లరేషన్‌లో ప్రతి పార్లమెంటు పరిధిలో రెండు అసెంబ్లీ స్థానాలను బీసీలకు కేటాయిస్తామని చెప్పి గత ఎన్నికల్లో కేవలం 22 స్థానాలు మాత్రమే ఇచ్చినా దొరల పాలనకు చరమగీతం పాడాలని సబ్బండ కులాలు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేశాయన్నారు. అధికారంలోకి వచ్చాక కూడా 37 నామినేటెడ్ పదవుల్లో 17 రెడ్లకు కేటాయించారని, కేవలం ఇద్దరికి మాత్రమే మంత్రి పదవులు ఇచ్చారని 5 శాతం ఉన్న అగ్రవర్ణాలకే 50 శాతం పదవులు కల్పిస్తూ నాడు దొరల పాలన, నేడు పటేళ్ల పాలనలా మారిందని విమర్శించారు. రాహుల్ గాంధీ జాతీయ స్థాయిలో బీసీ నాయకులతో జత కట్టి అధికారంలోకి వస్తే బీసీ కుల గణన చేపట్టి 90 శాతం పదవులు ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఇస్తామని చెబుతుంటే ఆయనను తప్పుదోవ పట్టించేలా ఇక్కడ పాలన జరుగుతుందన్నారు. 60 శాతం జనాభా ఉన్న భువనగిరి, మహబూబ్‌నగర్, నిజామాబాద్ పార్లమెంటు స్థానాలు రెడ్లకు కేటాయించి బీసీలకు తీరని అన్యాయం చేశారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఆయా బీసీ సంఘాల నాయకులు శ్రీనివాస్‌ముదిరాజ్, శ్యాం కుమార్ కుర్మ, సింగం నగేష్, జాజుల లింగం గౌడ్, గొడుగు మహేష్ యాదవ్, శ్రీనివాస్ గౌడ్, భాస్కర్, వరికుప్పల మధు ఉన్నారు.

కంటోన్మెంట్‌లో కాంగ్రెస్‌ను గెలిపించండి



సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన జైన్ సభ్యులు, శ్రీగణేశ్

కంటోన్మెంట్: త్వరలో జరగబోయే కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపునకు జైన్ సమాజం సహకారం అందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. కంటోన్మెంట్ కాంగ్రెస్ నేత, జైన్ సంఘం అధ్యక్షులు ప్రవీణ్ జైన్ ఆధ్వర్యంలో రాష్ట్ర జైన్ సంఘం ప్రతినిధులు ముఖ్యమంత్రిని కలిశారు. ఏప్రిల్ 21న నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఆవరణలో ఏర్పాటు చేయనున్న మహవీర్ జైన్ జయంతి వేడుకల్లో పాల్గొనాల్సిందిగా ముఖ్యమంత్రికి ఆహ్వానం అందజేశారు. జైన్ సమాజ్ ప్రతినిధులు అధిక సంఖ్యలో ఉండే కంటోన్మెంట్ ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాలని సీఎం వారిని కోరారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో జైన్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సుభాష్ జైన్, కోశాధికారి మహేందర్ జైన్, ప్రధాన కార్యదర్శి అశోక్ జైన్ ఉన్నారు.

టెట్ పరీక్ష ఫీజు తగ్గింపుపై ప్రభుత్వం ప్రకటన చేయాలి



వినతిపత్రం ఇస్తున్న విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ: టెట్ అర్హత పరీక్ష ఫీజు తగ్గింపు పై రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన చేయాలని బీసీ విద్యార్థి సంఘం వర్కింగ్ ప్రసిడెంట్ బొల్లెపల్లి స్వామిగౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. టెట్ పరీక్ష ఫీజు తగ్గింపు కోసం అభ్యర్థులు ఆందోళన చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. అయితే.. టీఎస్ విద్యుత్‌శాఖ జెన్‌కో కెమిస్ట్రీ పోస్టులకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, పీడబ్ల్యూడీ అభ్యర్థులకు 60 శాతం ఉన్న మార్కుల నిబంధనను సడలించాలని వినతిలో కోరారు. ఈ కార్యక్రమంలో ఏడుకొండలు, సురేష్‌గౌడ్, నవీన్, బద్రీ, జాల లాలు, రాజశేఖర్, మహేష్, పవన్ పాల్గొన్నారు.

రహదారిపై ఆయిల్.. జారిపడిన వాహనదారులు



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ సంపత్‌కుమార్

లాలాపేట: తార్నాక చౌరస్తాలో ప్రధాన రహదారిపై నుంచి శుక్రవారం వెళ్తున్న జీహెచ్ఎంసీ చెత్త తరలించే లారీ నుంచి ఆయిల్ లీకై రోడ్డుపై పడింది. ఇది గమనించకుండా ఆ మార్గంలో వెళ్తున్న పలు ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి కింపడిపోయారు. విషయం తెలుసుకున్న నల్లకుంట ట్రాఫిక్ ఏసీపీ సంపత్‌కుమార్, ఇన్స్పెక్టర్ రాంబాబు, ఏఎస్సై వెంకటేశ్వర్‌రావు సిబ్బందితో కలిసి ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని నివారణ చర్యలు చేపట్టారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రాంగోపాల్‌పేట్: క్లాక్‌టవర్, మోండా, సీతాఫల్‌మండి సబ్‌స్టేషన్ల పరిధిలోని ఫీడర్ల మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని ప్యారడైజ్ సీబీడీ ఏడీఈ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6.30 నుంచి 7 గంటల వరకు కళానికేతన్, కళాసీగూడ, ఎస్డీరోడ్, మంజు థియేటర్ ప్రాంతాలు. ఉదయం 7 గంటల నుంచి 7.30 వరకు రైల్వే పాస్‌పోర్టు కార్యాలయం, శ్రీసాయి గణేష్ లాడ్జి, రెతిఫైల్ బస్టాప్ ప్రాంతాలు. ఉదయం 7.30 గంటల నుంచి 8 వరకు మార్గదర్శి చిట్‌ఫండ్స్, సీఎంఆర్ టెక్స్‌టైల్స్, చెన్నై షాపింగ్‌మాల్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

సీతాఫల్‌మండి ఫీడర్ పరిధిలో..

ఉదయం 6.30గంటల నుంచి 7గంటల వరకు సీతాఫల్‌మండి వెల్ఫేర్ అసోసియేషన్, ఎల్ఎస్ టవర్, గణేష్ దేవాలయం, క్లాసిక్ అపార్ట్‌మెంట్ ప్రాంతాలు. ఉదయం 7గంటల నుంచి 7.30గంటల వరకు టీఆర్టీ క్వార్టర్స్, బీదలబస్తీ, కుట్టి వెలోడి హాస్పిటల్, ఎస్‌బీహెచ్ శివాజీ విగ్రహం, సెయింట్ జాన్సన్ స్కూల్ ప్రాంతాలు. ఉదయం 7.30గంటల నుంచి 8గంటల వరకు నామాలగుండు టెంపుల్, పద్మాగ్యాస్, కిందిబస్తీ, నెహ్రూ హైస్కూల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

సిబ్బంది కొరతతో సర్టిఫికెట్ల జారీలో జాప్యం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఎగ్జామినేషన్ బ్రాంచ్‌లో సిబ్బంది కొరతతో వివిధ సర్టి ఫికెట్ల జారీలో తీవ్ర జాప్యం జరుగుతుందని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ఇటీవల వివిధ ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం చర్యలు చేపట్టడంతో కోర్సులు పూర్తి చేసిన వందలాది మంది పూర్వ విద్యార్థులు డిగ్రీ పట్టాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఎక్కువ ఫీజు చెల్లించి స్పీడ్ మోడల్‌లో దరఖాస్తు చేసుకున్న సర్టిఫికెట్లు సకాలంలో అందడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. అయితే ఎగ్జామినేషన్ బ్రాంచ్‌లో పూర్తిగా కాంట్రాక్టు ఉద్యోగులతో కొనసాగుతుంది. వారి సంఖ్య చాలా తక్కువగా ఉండటంతో సర్టిఫికెట్ల జారీ, ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలనలో జాప్యం జరుగుతుందని వీసీ ప్రొ.రవీందర్ స్పందించి ఈ సమస్యపై దృష్టి సారించాలన్నారు.

ఖమ్మం ఎంపీ టికెట్‌పై ఓయూ జేఏసీ నేతలో ఉత్కంఠ!

ఉస్మానియా యూనివర్సిటీ: ఖమ్మం కాంగ్రెస్ ఎంపీ సీటు కేటాయింపుపై ఓయూ విద్యార్థి జేఏసీ నేతల్లో ఉత్కంఠ నెలకొంది. ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా పోటీ చేసే అవకాశం రాలేదని నామినేటెడ్ పదవులు కూడా దక్కలేదని విద్యార్థి నేతలు కాంగ్రెస్ పార్టీ పట్ల అసంతృప్తితో ఉన్న విషయం విదితమే. ఖమ్మం ఎంపీ స్థానాన్ని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సతీమణి నందినికి కాకుండా బీసీ నాయకులకు కేటాయించాలనే చర్చ జరగడంతో ఓయూ విద్యార్థి జేఏసీ నాయకులు డాక్టర్ లోకేష్‌యాదవ్ పేరు తెరపైకి వచ్చింది. తెలంగాణ ఉద్యమంతో పాటు భట్టి విక్రమార్క చేపట్టిన పాదయాత్రలో పాల్గొని గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపుకోసం ఎన్నికల ప్రచారం చేసిన లోకేష్ యాదవ్‌కు టికెట్ కేటాయించాలని ఓయూ జేఏసీ నాయకులు కోరుకుంటున్నారు. అయితే.. భట్టి విక్రమార్క గ్రామానికి చెందిన లోకేష్‌యాదవ్ ఆయన ప్రధాన అనుచరుడు.

పీజీ కోర్సుల్లో ప్రవేశాల ప్రకటన విడుదల చేయండి

ఉస్మానియా యూనివర్సిటీ: పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు ప్రకటన విడుదల చేయాలని తెలంగాణ విద్యార్థి పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు బారి అశోక్‌యాదవ్ డిమాండ్ చేశారు. ఓయూతో పాటు రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల్లో ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, ఇతర పీజీ, పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే కామన్ పీజీ ఎంట్రెన్స్ టెస్ట్–2024 (సీపీజీఈటీ) నోటిఫికేషన్ విడుదల ప్రతి ఏటా జాప్యంతో విద్యార్థులు నష్టపోతున్నారన్నారు. లా సెట్, ఐసెట్, ఇంజినీరింగ్ పీజీ సెట్, ఎడ్‌సెట్ తదితర సెట్ల నోటిఫికేషన్లు విడుదలైన పీజీ కోర్సుల ప్రకటనపై నిర్లక్ష్యం చేస్తున్నారని ధ్వజమెత్తారు. పీజీ ప్రవేశాల ప్రకటన జాప్యంతో ఓయూతో పాటు జేఎన్‌టీయూ, కాకతీయ, శాతావాహన, తెలంగాణ, మహాత్మాగాంధీ, పాలమూరు, తెలంగాణ ప్రభుత్వ మహిళ వర్సిటీలలో ఎంట్రెన్స్ టెస్టు మొదలుకొని ప్రవేశాల ప్రక్రియ, తరగతులు, సెమిస్టర్ పరీక్షలు, ఫలితాల విడుదలలో ఆలస్యమవుతుందన్నారు. సకాలంలో పీజీ కోర్సుల నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

'దానం'ను కలిసిన లష్కర్ నాయకులు



సికింద్రాబాద్: సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌ను శుక్రవారం సికింద్రాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి మద్దతు ప్రకటించారు. మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, సికింద్రాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆదం సంతోష్‌కుమార్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సృజన్‌కుమార్ నేతృత్వంలో పలువురు నాయకులు దానం నాగేందర్‌ను కలిశారు. దానం నాగేందర్ భారీ మెజారిటీతో విజయం సాధించడం ఖాయమన్నారు.

ఫ్లై ఓవర్‌పై యాక్సిడెంట్.. స్తంభించిన ట్రాఫిక్



లాలాపేట: తార్నాక ఫ్లై ఓవర్‌పై జరిగిన యాక్సిడెంట్‌తో ట్రాఫిక్ స్తంభించింది. శుక్రవారం మధ్యాహ్నం హబ్సిగూడ నుంచి సికింద్రాబాద్ వైపు ఫ్లై ఓవర్‌పై నుంచి వెళ్తున్న క్రమంలో ఓ కారు డీసీఎం వాహనాన్ని ఓవర్ టెక్ చేసే క్రమంలో కారు డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో వెనకాల నుంచి వస్తున్న వాహనాలు ఒకదానికొకటి ఢీకొట్టుకున్నాయి. దీంతో గంటల తరబడి ఫ్లై ఓవర్‌పై వాహనాలు నిలిచి పోయాయి. ఓయూ పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.



అభినందన

సికింద్రాబాద్ బార్ అసోసియేషన్ ఎన్నికల్లో అధ్యక్షుడిగా వసంత్ కుమార్, ఉపాధ్యక్షుడిగా రమణ తంపుల, ప్రధాన కార్యదర్శిగా సుశీల్ ఎన్నికయ్యారు. పీసీసీ సెక్రటరీ అయూబ్ ఖాన్ ఆధ్వర్యంలో ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన రమణ తంపులను సన్మానించి అభినందించారు. అడ్వొకెట్, వైస్ చైర్మన్ పీసీసీ లీగల్ సెల్ ఇమ్మాన్యుయేల్, సంగారెడ్డి మున్సిపాలిటీ కౌన్సిలర్ పరంజ్యోతి, కంటోన్మెంట్ మైనారిటీ చైర్మన్ జాఫర్ ఖాదీ, సోషల్ వర్కర్ తాజ్ మొయినోద్దీన్, గోపి పాల్గొన్నారు. –సాక్షి, సిటీబ్యూరో